సొంత డబ్బుతో కాలనీ గుంతలు పూడ్చి..





స్ప్రింగ్ విల్లాస్ కాలనీలో గుంతలను పూడుస్తున్న శ్రీవెంకటసాయి నిలయం అపార్ట్‌మెంట్ వాసులు

నిజాంపేట్: సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైంది. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఆ అపార్ట్‌మెంట్ వాసులు చేయి చేయి కలిపి ఎన్నోరోజులుగా వేధిస్తున్న సమస్యను పరిష్కరించుకున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి స్ప్రింగ్ విల్లాస్‌లోని శ్రీవెంకట సాయి నిలయం అపార్ట్‌మెంట్ వాసులు శనివారం రాత్రి సొంత నిధులతో కాలనీ రోడ్డులో ఏర్పడిన గుంతలను పూడ్చారు. కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలోని చైతన్య కళాశాలకు వెళ్లే మార్గంలో గుంతలన్నింటిని పూడ్చేసి సమస్యను పరిష్కరించుకున్నారు. గుంతలను పూడ్చి రాకపోకలకు అనువుగా రోడ్డును మార్చుకోవడంతో పలువురు అపార్ట్‌మెంట్‌వాసులను అభినందిస్తున్నారు.

అది జగద్గిరిగుట్ట కూరగాయల మార్కెట్. అక్కడే ఓ వృద్ధుడు ఉదయం నుంచి ఆకుకూరలు విక్రయిస్తున్నాడు. ఆకుకూరలు అమ్ముడుపోతే ఇంటికెళ్లిపోయేవాడు. కాని ఆదివారం కావడంతో ఆకుకూరలకు గిరాకీ తగ్గిందే ఏమో.. మిట్ట మధ్యాహ్నం 40డిగ్రీల సెల్సియస్ ఎండలోనూ ''గూడు కింది పిట్టలా.. గొడుగు కింద ఆ వృద్ధుడు''ఇలా కూర్చుని గిరాకీ కోసం ఎదురు చూస్తూ కనిపించాడు. ఎండైనా.. వానైనా.! ఇల్లు గడవాలన్నా.. పొట్టకూటి కోసమైనా ఇవ్వన్నీ తట్టుకోవాల్సిందే.!

– జగద్గిరిగుట్ట

ఎండైనా.. వానైనా..! ఇల్లు గడవాలంటే తప్పనా.!



గూడు కింది పిట్టలా.! గొడుగు కింద వృద్ధుడు

పర్యావరణ పరిరక్షణకు
600 మొక్కలు నాటి..



నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని నిజాంపేట్ కార్పొరేషన్ రెండో డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. ఆదివారం స్థానిక కెప్టెన్ లక్ష్మీ సెహగల్ పంచ తత్వ పార్కులో చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో 600 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలతో పచ్చదనంతో పాటు స్వచ్ఛమైన గాలి, సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు రెండు మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు భాస్కరాచారి, నాయకులు బోట్ల తిరుపతి, ఆంజనేయ వర్మ, మధుకర్‌రెడ్డి, నాయకులు వీరప్రతాప్, సందీప్, శశిధర్, క్రాంతి, తోట శ్రీకాంత్, సుబ్రహ్మణ్య శెట్టి, రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేస్తాం



ఉచిత హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న వైద్యులు

దుండిగల్: పేద, మధ్య తరగతి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు కిమ్స్, సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సర్వేజన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గురువారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ చర్చిగాగిల్లాపూర్‌లో గ్రాన్యూల్స్ ఇండియా, సర్వేజన ఫౌండేషన్, నిర్మాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ... మోకాళ్ల నొప్పులతో బాధపడే నిరుపేదలకు ఉచితంగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను చేస్తామని, సంవత్సరానికి ఉచితంగా 365 శస్త్ర చికిత్సలను నిర్వహిస్తామన్నారు.

◆ అనంతరం గ్రాన్యూల్స్ ఇండియా ఈడీ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలను చేయిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్, మోకాళ్ల మార్పిడి చికిత్సలను అందిస్తామన్నారు. అదే విధంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈకార్యక్రమంలో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆదర్శ్ అన్నపరెడ్డి, కుశాల్ హిప్పాల్ గోవంకర్, దివాకర్‌రెడ్డి, ఫౌండేషన్ వైస్ చైర్మన్ రాము ఎలమంచిలి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక పోటీల్లో క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిఏటా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

ఇఫ్తార్ విందుకు సునీతామహేందర్‌రెడ్డి



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీనగర్‌లో ఆదివారం కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఆరిఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మత సామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పున్నారెడ్డి లక్ష్మి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, రెహమాన్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్ మహిళా మోర్చా నూతన కమిటీ



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రేవతిసింగ్ నియమితులయ్యారు. ఆదివారం గాజులరామారంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా మోర్చా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సుజాత, స్వాతి, ఉపాధ్యక్షులుగా కల్పన, భాగ్యను నియమించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలు వివరిస్తూ పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, ఉపాధ్యక్షుడు శివనంద, రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి రేవతిరెడ్డి, సెక్రటరీ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలపై 'సీ-విజిల్'

- ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్
- సీ-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 13 కేసులు నమోదు.. పరిష్కారం



సాక్షి,మేడ్చల్ జిల్లా: బాధ్యతగల పౌరులుగా ఎన్నికలలో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలనుకుంటే సీ- విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎవరైనా డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభపెట్టిన, మద్యం సరఫరా చేసినా, నేరపూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా... తాజా ఫొటోలతోసహా వీడియోలు, ఆడియో రికార్డ్‌లతో సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎక్కడైతే ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో దానికి సంబంధించిన ఫొటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100 నిమిషాలలోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదుపై ఐదు నిమిషాలలోపే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో ఉండే మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిమిషాల లోపు క్షేత్ర పరిశీలన అధికారి అయిన ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలను విచారణ నిమిత్తం పంపిస్తారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకొని క్షేత్ర విచారణ చేసి, 30 నిమిషాలలో వివరాలు సేకరించి, తమ నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి నివేదిస్తారని పేర్కొన్నారు. దానిపై రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కూడా 24 గంటలు సీ- విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసినవారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. సీ-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, తీరా ఆ ప్రదేశానికి చేరుకునే లోపు ఆధారాలు లేకుండా ఉండటం వల్ల సమయం వృధా అవుతుందన్నారు. గతంలో ఇలాంటి పొరపాట్లు గమనించినట్లు గౌతమ్ తెలిపారు. పక్కా రుజువులు ,ఆధారాలు ఉన్నప్పుడే సీ-విజిల్‌కు ఫిర్యాదులు చేయాలని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా సీ- విజిల్ యాప్ ద్వారా 13 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం బీజేపీదే..



మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ అత్యధిక మెజార్టీతో సొంతం చేసుకుంటుందని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఆయన జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచిందన్నారు. నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు వచ్చాయంటే అది మోదీ చలవేనని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సైతం బీజేపీ 400 పైచీలుకు సీట్లు కైవసం చేసుకుని హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్‌సాగర్, శివాజీరాజు, కొంపల్లి అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సరితా రావు, అశోక్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు



సుభాష్‌నగర్: ప్రధాన రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాజులరామారం సూరారం ప్రాంతంలో కలిపే ఈ రోడ్డు గుండా వాహనాల రద్దీ ఎక్కువ ఉంటుంది. రాత్రి వేళలో గమనించక వాహనదారులు విద్యుత్ స్తంభాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అబోడ్ బయోటెక్‌తో ఓయూ ఒప్పందం..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అబోడ్ బయోటెక్ ప్రతినిధులు ఎం.శ్రీనాథ్, షాలిని ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇతర అంశాలపై సహకారం కోసం సంతకాలు చేశారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా చింతల నాగరాజు



నియామక పత్రం అందుకుంటున్న చింతల నాగరాజుయాదవ్

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు చింతల నాగరాజును మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని రాష్ట్ర అధ్యక్షుడు చేతుల మీదుగా నాగరాజు యామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజుయాదవ్ మాట్లాడుతూ... తాను పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడు మురహరి జిల్లా ప్రెసిడెంట్ గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలి

ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్



కుత్బుల్లాపూర్: ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంతో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ అన్నారు. ఆదివారం ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కొంపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఇండిక్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యాహక్కు చట్టాన్ని, ఫీజు నియంత్రణ చట్టాన్ని ఉల్లఘింస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతోందన్నారు. లక్షలాది రూపాయలను ఫీజుల పేరుతో వసూలు చేస్తోందని విమర్శించారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు టీసీలు ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేసినా పెడచెవిన పెడుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో వ్యాపారం చేస్తున్న ఇండిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

15న బీరప్పస్వామి కల్యాణ మహోత్సవం



మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌ను ఆహ్వానిస్తున్న బీరప్పస్వామి దేవాలయ కమిటీ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ బీరప్పనగర్‌లోని బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఏప్రిల్ 15న ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు బీరప్పస్వామి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది.

◆ 12వ తేదీ రాత్రి బీరప్పస్వామికి మైలలు తీయుట, 13వ తేదీ ఉదయం 9గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, సాయంత్రం 4 గంటలకు బీరప్పస్వామికి గంగ పూజ, 14వ తేదీ ఉదయం 7 గంటలకు బీరప్పస్వామికి వడక లగ్నం, 9 గంటలకు కొట్నం పెట్టుట, సాయంత్రం 4 గంటలకు ఇళ్ల మీద సరుగు పోయుట, 6 గంటలకు బోనాలు, రాత్రి బీరప్పస్వామి ఒగ్గు కథ, 15వ తేదిన శ్రీబీరప్పస్వామి, కామరాతి అమ్మవారి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 4 గంటలకు గొర్ల మందమీద సరుగు పోయుట, 16వ తేదిన శ్రీరేణుక ఎల్లమ్మ పరశురాముని వేషాలతో ఒగ్గుకథ, సాయంత్రం 4 గంటలకు గారడి వేషం , 17వ తేదిన నాగవెల్లి జరుపుట, సాయంత్రం 6 గంటలకు గొర్ల కల్యాణం, గొర్లకు సల్లపోయుట, రాత్రి కామరాతి అమ్మవారికి ఒడి బియ్యం, 18వ తేదిన బయ్యన్న పూజ, తొక్కుడు మైలలు, పదార్ పండుగ వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ పేర్కొంది.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితులు

నిజాంపేట్: ఇళ్లల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు ముఠా సభ్యులను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన డ్యాన్స్ మాస్టర్ రమణ(27), మియాపూర్ ఓంకార్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ (25) లేబర్‌గా పని చేసే రమేష్(33) లు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. తమ అవసరాలకు సులభంగా డబ్బుల సంపాదించాలనే ఆశతో దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేయసాగారు. వీరు ముగ్గురు బాచుపల్లి, కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో దొంగతనాలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం బాచుపల్లి పోలీసులు డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ నేతృత్వంలో మియాపూర్ న్యూ కాలనీకి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కస్టడీలో తమదైన శైలిలో విచారించగా దొంగతనాల చిట్టా విప్పారు. నిందితుల నుంచి రూ.90 వేల విలువ చేసే ఎల్రక్టిక్ వైర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

స్నేహితుడిని హత్య చేసిన నిందితుడి రిమాండ్



నిందితుడు సమీర్

జీడిమెట్ల: స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన కేసులో జీడిమెట్ల పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన జైలర్ సింగ్(25), సమీర్(24)లు స్నేహితులు. కాగా వీరిద్దరికి బైక్ రిపేర్ విషయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో జైలర్‌సింగ్ సమీర్‌ను తీవ్రంగా హెచ్చరించాడు. 'నన్నే హెచ్చరిస్తావా..'అని కోపం పెంచుకున్న సమీర్ మాట్లాడుకుందాం రమ్మని పిలిచి ముందుగానే తనతో తెచ్చుకున్న కత్తితో జైలర్‌సింగ్‌ను మెడపై కడుపులో పొడిచి హత్య చేశాడు. మృతుడి తండ్రి భగవాన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సమీర్‌ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విదేశీ విద్యార్థుల ప్రవేశాలు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశాల విద్యార్థుల ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారు. పూర్తి వివరాలకు osmania.ac.inను చూడొచ్చు.

ఇఫ్తార్





ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగర సంస్కృతి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వివేకానంద్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్షకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ ఉపవాస దీక్షలతో దైవ చింతనతో పాటు ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ఈ ఇఫ్తార్ విందులో స్థానిక కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్:

కుటుంబ యోగా దినోత్సవం



నిజాంపేట్: యోగాసనాలతో ఉల్లాసంగా.. ఆరోగ్యంగా ఉంటామని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో పతాంజలి యోగా సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సమేతంగా పాల్గొని యోగాసనాలు వేశారు. పతంజలి యోగా నిర్వాహకుడు, రిటైర్ జడ్జి జనార్దన్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఒక గంట పాటు యోగా చేస్తే బీపీ, షుగర్‌లు దరి చేరవన్నారు. ఏళ్ల తరబడి అనారోగ్యంతో బాధపడుతున్న చాలా మందికి యోగాసనాల ద్వారా స్వాంతన చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్లు మల్లికార్జున్, నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, బైండ్ల నగేష్, ఇంద్రసేనారెడ్డి, శ్రీలక్ష్మి, కాశి, ప్రేమ్ కుమార్, ఏనుగుల సత్తిరెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.